సాగుకు రైతన్నల సమాయత్తం



కుందూనదిలో పారుతున్న నీరు



ముందుగా పులక చల్లడంతో పచ్చగా కళకళలాడుతున్న నారు

రాజుపాళెం : కుందూతీర ప్రాంత పరిధిలోని కొంత మంది రైతులు నారు పులక, వడ్లు చల్లుకుంటున్నారు. కుందూలో అరకొరగా వస్తున్న నీటిని నమ్ముకొని వరి పంటను సాగు చేస్తున్నారు. ముందస్తుగా పంటను సాగుచేస్తే ఎటువంటి చీడపీడలు రావని అక్కడి రైతులు చెబుతున్నారు. కొన్ని గ్రామాల్లో ఇప్పటికే పులక చల్లడంతో నారుమడి పచ్చగా కళకళలాడుతోంది. ఈఏడాది మంచి దిగుబడులు రావాలని, ధరలు బాగుండాలని కోటి ఆశలతో పులక చల్లుతున్నామని తెలిపారు.



నారుమడిలో వడ్లు చల్లుతున్న రైతులు



పులక చల్లేందుకు నారుమడిని ఎద్దులతో సిద్ధం చేస్తున్న రైతు

గడ్డి విత్తనాలు మంజూరు

రాజుపాళెం : రాజుపాళెం మండలానికి 650 కేజీల గడ్డి విత్తనాలు వచ్చినట్లు పెద్దముడియం, రాజుపాళెం మండలాల పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. ఆ గడ్డి విత్తనాల్లో రెండు రకాలు ఉన్నాయని, మేజ్ రకం 5 కేజీల ప్యాకెట్ పూర్తి ధర రూ.340 కాగా సబ్సిడీ రూ.255, రైతు వాటా రూ.85 చెల్లించాలన్నారు. జోవర్ రకం 5 కేజీల ప్యాకెట్ పూర్తి ధర రూ.460, సబ్సిడీ రూ.345, రైతు వాటా రూ.115 చెల్లించి విత్తనాలను తీసుకోవచ్చన్నారు. మండలంలోని కొర్రపాడు, రాజుపాళెం, పర్లపాడు, గాదెగూడూరు గ్రామాల్లోని పశువైద్యశాలలో ఈ విత్తనాలు అందుబాటులో ఉంటాయని ఆయన వివరించారు.

ఎర్రచందనం అక్రమ రవాణాను అరికడదాం

ఖాజీపేట : ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని ప్రొద్దుటూరు రేంజ్ ఎఫ్ఆర్ఓ హేమాంజలి తెలిపారు. ఎర్రచందనం అక్రమ రవాణాకు ఎవ్వరు పాల్పడినా జైలుకు పంపుతామని హెచ్చరించారు. ఖాజీపేట మండల పరిధిలోని ఖాజీపేట సెక్షార్, జాండ్లవరం బీట్, నాగసానిపల్లె, పత్తూరు బీట్ పరిధిలో ఫారెస్ట్ అధికారులు కూంబింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా హేమాంజలి మాట్లాడుతూ కొత్త వ్యక్తులు సంచరిస్తే వెంటనే సమాచారమివ్వాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

క్లుప్తంగా

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన స్వయంభు లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆషాఢమాసం రెండవ శనివారం సందర్భంగా స్వామి, అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు. భక్తుల దర్శనార్థం స్వామివారిని ప్రత్యేక అలంకరణలో ఉంచారు. భక్తులకు ఆలయ పూజారి పెంచలయ్యస్వామి తీర్థప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ప్రసన్న వేంకటేశ్వరుడు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక బొల్లవరంలోని శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున పంచామృతాభిషేకం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించి కాయాకర్పూరాలను నైవేద్యంగా సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజించారు. సాయంత్రం భక్తులు సామూహికంగా భజనలు చేసి భక్తిగీతాలు ఆలపించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందచేశారు.

మొహరం భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలి

పోరుమామిళ్ల(అట్లూరు) : మొహరం పండుగను భక్తిశ్రద్ధలతో ప్రజలు జరుపుకోవాలని పోరుమామిళ్ల సీఐ చిరంజీవి, ఎస్ఐ తిమోతిలు తెలిపారు. పోరుమామిళ్ల సర్కిల్ కార్యాలయంలో శనివారం ఆయన మొహరం పండుగ జరుపుకునే కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తినా అందుకు బాధ్యులుగా గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు. అందరూ ఐకమత్యంగా పండుగను జరుపుకోవాలన్నారు.

విద్యుత్ లైన్‌ను మార్చాలి



విద్యుత్ లైన్ మార్చాలని వేడుకుంటున్న దమ్మనపల్లి గ్రామస్తులు

పోరుమామిళ్ళ (అట్లూరు) : తమ ఇళ్లపై వెళుతున్న 11 కె.వి. విద్యుత్ వైర్లను తొలగించాలని మండలంలోని దమ్మనపల్లి గ్రామ ప్రజలు విద్యుత్ అధికారులను వేడుకుంటున్నారు. రెండు సంవత్సరాల క్రితం విద్యుత్ వైర్లు తెగిపడి భార్యభర్తలు మృతిచెందడంతో పిల్లలు అనాథలుగా మిగిలారని తెలిపారు. ఇటువంటి ప్రమాదాలు మళ్లీ జరగకుండా ఇళ్లపై కాకుండా ఊరు బయట నుంచి విద్యుత్ లైన్ తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కుష్టువ్యాధిని నిర్మూలిద్దాం



ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

చాపాడు : మండలంలో కుష్టువ్యాధిని నిర్మూలిద్దామని మండల ఆరోగ్య విస్తరణాధికారి ఎం.రాఘవయ్య పిలుపునిచ్చారు. ఈ నెల 18 నుంచి ఆగస్టు 2 వరకూ నిర్వహించనున్న జాతీయ కుష్టువ్యాధి నిర్మూలనపై నాగులపల్లెలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటి వెళ్లి కుష్టువ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుష్టువ్యాధి రహిత మండలంగా తీర్చిదిద్దాలని కోరారు. స్పర్శ లేని మచ్చలు, పాలిపోయిన మచ్చలు, దురద లేని మచ్చలు, మొద్దుబారిన మచ్చలుంటే వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. వ్యాధిగ్రస్తులను సకాలంలో గుర్తించి వైద్య సిబ్బంది సేవలు అందించాలన్నారు. రోగులకు ప్రభుత్వం ఉచితంగా మందులను పంపిణీ చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ బాబురెడ్డి, ఏఎన్ఎం మేరి, ఆశా వర్కర్ గౌతమి తదితరులు పాల్గొన్నారు.

అవినీతిపరులపై చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు : స్థానిక మున్సిపల్ ఆఫీసులో అవినీతికి పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ పేర్కొన్నారు.

శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ కార్మికుల వద్ద నుంచి పీఎఫ్‌లో తప్పులను సవరిస్తామని డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. ఇటీవల డ్రైవర్లకు రూ.24వేలు వేతనం పెరిగితే వేతనం చేసేందుకు రూ.2వేలు వసూలు చేస్తుండటం దుర్మార్గమన్నారు. కింది స్థాయి ఉద్యోగులు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని, కమిషనర్ వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏ సెక్షన్‌లో ఉన్న వారిని ఆ సెక్షన్‌లోనే విధులకు పంపకుండా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు తమ చుట్టు తిప్పుకుంటున్నారన్నారు. దీంతో కార్మికులపై పనిభారం పడుతోందని అడిగిన



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ

కార్మిక సంఘం నాయకులపై దాడి చేసిన వారిని సస్పెండ్ చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఓబయ్య, శీను, శివ, లక్ష్మయ్య పాల్గొన్నారు.

పశుగ్రాసంతో అధిక పాల దిగుబడి

రాజుపాళెం : పశువులకు పచ్చి గడ్డి వేయడం వల్ల అధికంగా పాలు ఇవ్వడమేగాకుండా ఆరోగ్యం, రోగ నిరోధక శక్తి పెరుగుతుందని గాదెగూడూరు పశు వైద్య అధికారి డాక్టర్ కె.ప్రదీప్ కుమార్ రెడ్డి తెలిపారు. శనివారం పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా గ్రామంలో పాడి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుగ్రాసం వల్ల పాలల్లో వెన్నశాతం పెరిగి పాడి రైతులకు ఎక్కువ ఆదాయం వస్తుందన్నారు. జొన్న, మొక్కజొన్న, సజ్జ, పిల్లి పెసర,



రైతులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ప్రదీప్‌కుమార్‌రెడ్డి

బహువార్షికాలైన సూపర్ నెబిరియల్, పారాగ్రాస్ వాడకం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.

డిప్లొమా ఫలితాల్లో విద్యార్థినుల ప్రతిభ

ప్రొద్దుటూరు కల్చరల్ : మండలంలోని పెద్దశెట్టిపల్లె గౌతమి మహిళా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినులు మొదటి సంవత్సరం ఫలితాల్లో ప్రతిభ చూపారని ప్రిన్సిపాల్ వై.ప్రకాశ్ రావు తెలిపారు. డీఈసీఈ విభాగంలో వి.పూజ 98.09 శాతం, పి.మునియామిని 97.09, టి.మౌనిక 96.10 శాతం సాధించారని ఆయన పేర్కొన్నారు. డీసీఎంఈ విభాగంలో వై.సంగీత 95.7, ఎల్.మస్తాన్‌బీ 95.3, డి.నందిని 94.5, డీఈఈఈ విభాగంలో ఎం.దివ్యనయన 91.1 శాతం మార్కులు సాధించారని వివరించారు. వీరితోపాటు 25 మంది విద్యార్థినులు 90శాతంపైగా మార్కులు సాధించారని తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థినులను కళాశాల కరస్పాండెంట్ కేసీ బాబమ్మ, డైరెక్టర్లు నాగూర్, రవీంద్రారెడ్డి, కో డైరెక్టర్ శైలూష, ఇంజనీరింగ్‌కాలేజి డాక్టర్ ఎం.రామ సుబ్బమ్మ, వివిధ విభాగాల అధిపతులు మహమ్మద్ జబీర్, యాకూబ్ ఆలీ, బాల సుబ్బమ్మ, విజయమ్మ అభినందనలు తెలిపారు.



ప్రతిభ చూపిన విద్యార్థినులతో కళాశాల ప్రిన్సిపాల్, డైరెక్టర్లు, అధ్యాపకులు

అడవి ఆవుల మందతో రైతులు బెంబేలు

కొండాపురం : మండలలో 15 వేల హెక్టార్లలో సాగు భూమి విస్తీర్ణం ఉంది. వివిధ రకాల పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ఈ పొలాల్లో అడవి ఆవులు సంచరిస్తూ పంటలను నాశనం చేస్తున్నాయి. బొమ్మేపల్లె, దొంతికోన కొండ ప్రాంతాల్లో గతంలో అడవి ఆవులు నివాసం ఉంటున్నాయి. గతంలో గండికోట జలాశయంలో పూర్తి నీటి సామర్థ్యం పెట్టడంతో ప్రాజెక్టు సమీపంలో ఉండే అడవి ఆవులు పంట పొలాల్లోకి వచ్చి చేరాయి. రాత్రివేళ సాగు చేసిన పొలాల్లో తిరుగుతూ పంటలను నాశనం చేస్తున్నాయని రైతులు తమ బాధను వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కోనవారిపల్లె, ఉస్తికాయలపల్లె, కొట్టాలపల్లె, బురుజుపల్లె, కె.సుగుమంచిపల్లె, వెంకటాపురం, బ్రాహ్మణపల్లె, గ్రామాల్లో అడవి ఆవులతో రైతులకు తిప్పలు తప్పడం లేదు. ఫారెస్ట్ అధికారులు స్పందించి అడవి ఆవుల బెడద లేకుండా చూడాలన్నారు.



పొలాల్లో సంచరిస్తున్న అడవి ఆవులు

క్రీడా పోటీలతో శారీరక, మానసిక ఉల్లాసం

ఏపీఎస్ ఆర్టీసీ ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఉద్యోగులు క్రీడా పోటీల్లో పాల్గొనడం ద్వారా శారీరక, మానసికంగా ఉల్లాసవంతంగా ఉండడమే కాకుండా విధి నిర్వహణలో చురుగ్గా ఉండగలరని ఏపీఎస్ ఆర్టీసీ కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం కడప నగర పరిధిలోని స్పోర్ట్స్ స్కూలులో ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో ఆలిండియా పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ స్పోర్ట్స్ మీట్–2024 నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈడీ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగిలో ప్రతిభ పాటవాలు దాగి ఉంటాయన్నారు. ఉద్యోగులు క్రమం తప్పకుండా క్రీడా సాధన చేస్తూ ఆయా క్రీడా పోటీల్లో పాల్గొనడం ద్వారా తమ సత్తా చాటగలరన్నారు. అంతేకాకుండా క్రీడల్లో రాణించే వారికి ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. అలాగే పదోన్నతుల్లో



క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు

కూడా ప్రాధాన్యత ఉంటుందన్నారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించి భవిష్యత్తులో మరింత రాణించాలని సూచించారు. అనంతరం ఈడీ క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజారవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డితోపాటు పలువురు ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

అధికార భాషా సంఘాన్ని పునరుద్ధరించండి

బద్వేలు అర్బన్ : అధికార భాషా సంఘాన్ని సమర్థులతో పునరుద్ధరించాలని భారత రాష్ట్రపతి అవార్డు గ్రహీత, తెలుగుభాష వికాస ఉద్యమ జిల్లా అధ్యక్షుడు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు తెలిపారు. శనివారం మొల్ల సాహితీపీఠం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మాతృభాషాభివృద్ధికి స్పష్టమైన విధివిధానాలను ఏర్పాటు చేసి తగినంత నిధులను సమకూర్చి అధికారాలను ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. తెలుగుభాష కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన గిడుగురామ్మూర్తి పంతులును ఆదర్శంగా తీసుకుని మాతృభాషను అభివృద్ధి చేసి అచ్చమైన తెలుగువారిగా జీవించాలని ప్రజలను కోరారు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయండి

బద్వేలు అర్బన్ : ఈనెల 24, 25, 26వ తేదీల్లో అన్నమయ్య జిల్లా మదనపల్లిలోని హార్సిలీహిల్స్‌లో జరగనున్న ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్రస్థాయి విద్య, వైజ్ఞానిక శిక్షణ తరగతులను జయప్రదం చేయండి అని ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి నాగేష్ తెలిపారు. శనివారం మున్సిపల్ కార్యాలయం ఎదుట నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం కార్మికులకు అవగాహన కల్పించేందుకు ఈ శిక్షణ తరగతుల్లో చర్చిస్తారన్నారు. సమావేశంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సీనియర్ నాయకులు జె.వి.రమణ, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

కాశినాయన ఎస్ఐగా హుసేన్

కాశినాయన : స్థానిక ఎస్ఐగా తాయిర్ హుసేన్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ అమర్‌నాథ్‌రెడ్డి సెలవులో వెళ్ళిపోవడంతో ఆయన స్థానంలో తాత్కాలికంగా తాయిర్ హుసేన్‌ను నియమించారు.

రాష్ట్రస్థాయిలో విద్యార్థి ప్రతిభ



విద్యార్థి అనంతసేన

మైదుకూరు : మైదుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ మొదటి బ్యాచ్‌కు చెందిన విద్యార్థి పి.అనంత సేన రాష్ట్ర స్థాయిలో మంచి మార్కులు సాధించి ప్రతిభ కనపరిచాడు. అనంతపురం జిల్లా డి.హిరేహాళ్ మండలం మురడి గ్రామానికి చెందిన అనంతసేన మైదుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో గత ఏడాది మొదటి సంవత్సరం 'కంప్యూటర్ ఇంజనీరింగ్ అండ్ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్' బ్రాంచిలో చేరాడు. టెక్నికల్ బోర్డు ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నిర్వహించిన మొదటి సంవత్సరం పరీక్షల్లో ఈ విద్యార్థి 1054/1100 మార్కులు (96 శాతం) సాధించి రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందాడు. కళాశాల ప్రిన్సిపాల్ పి.గురుమూర్తి రెడ్డి మాట్లాడుతూ కళాశాల ప్రారంభించిన మొదటి బ్యాచ్‌లోనే 'కంప్యూటర్ ఇంజనీరింగ్ అండ్ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్' బ్రాంచ్ విద్యార్థి 96 శాతం మార్కులు సాధించడం కాలేజీకి గర్వకారణమని అన్నారు.

కౌలు రైతులకు సాగు హక్కు పత్రాలు

ముద్దనూరు : కౌలుకు భూమి సాగు చేస్తున్న ప్రతి రైతుకు పంట సాగు హక్కు పత్రాలు అందజేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. కౌలుకు భూమిని సాగు చేస్తున్న రైతులు వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులను సంప్రదించి సాగు ధృవీకరణ పత్రాలు పొందాలని, ఈ కార్డు పొందిన రైతుకు 11 నెలల కాల వ్యవధి మాత్రమే భూమిని సాగు చేసే హక్కు వుటుందన్నారు. మిగతా వివరాల కోసం అధికారులను సంప్రదించాలని ఏవో తెలిపారు.

ఆర్ఐఓ కార్యాలయం ఎదుట ధర్నా

కడప వైఎస్ఆర్ సర్కిల్: సెలవు దినాల్లో తరగతులు నిర్వహిస్తున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం నగరంలోని ఆర్ఐఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రధానంగా నారాయణ, శ్రీ చైతన్య, గాయత్రి ,ప్రైవేట్ కళాశాలలలో మొత్తంగా ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా సెలవు దినాల్లో తరగతులు నిర్వహించడం, విద్యార్థి హక్కులను కాలరాయడమేనని అన్నారు.

జీపీఎస్ అమలుపై రాజపత్రాన్ని ఉపసంహరించుకోవాలి

బద్వేలు అర్బన్ : సీపీఎస్ ఉద్యోగులకు జీపీఎస్ విధానాన్ని అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన రాజపత్రాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు విజయకుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన రాజపత్రాల ప్రతులను దగ్ధం చేస్తూ వినూత్న నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీపీఎస్ విధానంపై ఉద్యోగ, ఉపాధ్యాయుల నుండి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడంతో జీవో విడుదలలో జాప్యం చేశారని అన్నారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వం రూపొందించిన జీపీఎస్ విధానాన్ని అమలు చేస్తూ పాత తేదీలలో రాజపత్రాన్ని విడుదల చేయడం దుర్మార్గమన్నారు. ఎన్నికల సమయంలో ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, విద్యాశాఖామంత్రి లోకేష్‌లు కూటమి అధికారంలోకి వస్తే సీపీఎస్ స్థానంలో జీపీఎస్ కంటే మెరుగైన విధానాన్ని అమలు చేస్తామని ఇచ్చిన హామీని విస్మరించారా అని ప్రశ్నించారు. తక్షణమే ప్రభుత్వం విడుదల చేసిన రాజపత్రాలను ఉపసంహరించుకోవాలని, అలా కాకుండా ఉద్యోగ, ఉపాధ్యాయ వ్యతిరేక విధానాలను అమలు చేయాలని చూస్తే పోరాటాలకు సన్నద్ధమవుతామన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఓబుల్‌రెడ్డి, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు శివప్రసాద్, బద్వేలు, గోపవరం మండలాల ప్రధాన కార్యదర్శులు సుధాకర్, కృష్ణుడు, అట్లూరు మండల అధ్యక్షుడు కంచిరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీఓ కార్యాలయం ఎదుట జీపీఎస్ అమలు రాజపత్రాలను దగ్ధం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

జీపీఎస్‌పై విడుదల చేసిన గెజిట్‌ను రద్దు చేయాలి

పోరుమామిళ్ళ (అట్లూరు) : గ్యారెంటీ పెన్షన్ స్కీమ్ (జీపీఎస్)పై విడుదల చేసిన గెజిట్‌ను వెంటనే రద్దు చేయాలని ఎస్టీయూ మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.పుల్లయ్య, ఎ.జయరామిరెడ్డిలు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఈనెల 12న జీపీఎస్ గెజిట్ విడుదల చేయడం దారుణమన్నారు. విద్యాశాఖామంత్రి నారాలోకేష్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పాఠశాలల విలీన ప్రక్రియకు సంబంధించిన జీవో నెం.117ను వెంటనే రద్దు చేసి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను కాపాడాలని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు మాత్రమే తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర కౌన్సిలర్ ఓ.చంద్రహాసరెడ్డి, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఎల్.పుల్లారెడ్డి, ఎస్టీయూ జిల్లా కమిటీ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

తల్లికి వందనం ప్రతి విద్యార్థికి ఇవ్వాలి

అట్లూరు : తల్లికి వందనం పథకం ద్వారా కుటుంబంలో ఎంత మంది విద్యార్థులు ఉన్నా ఒక్కో విద్యార్థికి రూ.15 వేలు ఇవ్వాలని ఎమ్మెల్సీ డీసీ గోవింద రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోరుమామిళ్ల పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి రాక ముందు ఎంత మంది పిల్లలున్నా అంత మందికి తల్లికి వందనం ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఒకరికే అనడం దారుణమన్నారు. అలాగే ఉచితంగా ఇసుక విధానం కూడా అమలు చేయాలన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రప్రజలు మరింత వంచనకు గురయ్యే పరిస్థితులే మెండుగా కనపడు తున్నాయన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

వ్యవసాయం, గ్రామీణాభివృద్ధికి నాబార్డు కృషి

కడప కల్చరల్ : వ్యవసాయంతోపాటు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం నాబార్డు సంస్థ ఎంతో కృషి చేస్తోందని సంస్థ జిల్లా అభివృద్ధి అధికారి విజయ్ విహారి అన్నారు. సంస్థ 43వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన విజయ్ విహారి తొలుత తానే రక్తదానం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ స్పెషల్ ఆఫీసర్ శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ రైతు సోదరులు తమ కార్యాలయానికి విచ్చేసి రక్తదానం చేయడంతో సంస్థకు గౌరవం చేకూరినట్లయిందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి మరింత ఎక్కువగా రక్తదాతలు ముందుకు రావాల్సిన అవసరాన్ని గుర్తుచేశారు. గ్రామీణ వర్గాల పరిస్థితిని మెరుగు పరచడం, దేశ వ్యాప్తంగా వ్యవసాయ ఉత్పాదకతను పెంచడంలో విశేషమైన సహకారాన్ని గుర్తించేందుకు ఈ రోజును అంకితం చేశారన్నారు. స్థిరమైన వ్యవసాయ, గ్రామీణాభివృద్ధిని ప్రోత్సహించేందుకు నాబార్డు బ్యాంకును స్థాపించారన్నారు. గ్రామీణులకు ప్రయోజనం చేకూర్చే విధానాలు, కార్యక్రమాల అమలులో సంస్థ ముందంజలో ఉందన్నారు. 43 సంవత్సరాలుగా సంస్థ ఎన్నో విజయాల మైలురాళ్లను సాధించిందని వివరించారు. నాబార్డు డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ మేనేజర్ విజయ విహారి మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సేవలను అభినందించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రక్తదాన ఆవశ్యకత గురించి మరింత విస్తృతంగా ప్రచారం కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో 25 మందికి పైగా రైతులు రక్తదానం చేశారు. పులివెందుల, ప్రొద్దుటూరు, ఒంటిమిట్ట, ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్, సుస్థిర వ్యవసాయ కేంద్రం తదితర ప్రాంతాల నుంచి ఆయా సంస్థల ఉన్నతాధికారులు, రైతు సంఘాల ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాబార్డు జిల్లా అభివృద్ధి అధికారి విజయ్ విహారి

హ్యాండ్‌బాల్ క్రీడలో ఎన్నో విజయాలు

కడప స్పోర్ట్స్ : జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఏర్పాటైన యేడాదిలోపు ఎన్నో విజయాలను సొంతం చేసుకుందని ఏపీ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ వైఎస్ఆర్ కడప జిల్లా అధ్యక్షుడు లయన్ కె. చిన్నపరెడ్డి పేర్కొన్నారు. శనివారం నగరంలోని మానస ఇన్ హోటల్‌లో జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన కార్యవర్గం ఏర్పాటైన అనతికాలంలోనే జిల్లాలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలను విజయవంతం చేశామన్నారు. రిగతంలో ఎన్నడూ లేని విధంగా వివిధ విభాగాల్లో జిల్లా నుంచి 15 మంది క్రీడాకారులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికవడం విశేషమన్నారు. జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎ. సింధూరి, ఆర్గనైజింగ్ సెక్రటరీ వి.వి. శివప్రసాద్‌లు మాట్లాడుతూ జిల్లాలో హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రగతి గురించి వివరించారు.



మాట్లాడుతున్న హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు లయన్ కె. చిన్నపరెడ్డి